# ధర్మ వ్యాధో పాఖ్యానము - తల్లి దండ్రులు - మానవ విలువలు.

**విల్లూరి అప్పల సత్యనారాయణ**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు,**
**నర్సీపట్నం.**
**ఫోన్ నెంబరు : 92472 31382.**

భగవందుని సృష్టిలో ఎనభై నాలుగు లక్షల జీవరాశులన్నాయానీ వాటిలో మానవ జన్మ గొప్పదనీ చెబుతూ ఉంటారు. మానవ జన్మ ఎందుకు గొప్పదీ అంటే ఇతర జంతుజాలంతో పోల్చినపుడు వాటికిలేని జ్ఞానసంపద మానవుడికి మాత్రమే ఉండటం అందుకే

**" ఆహార నిద్రా భయమైదునాని**
**సకలం సమానం పశుభిర్నరాణాం**
**జ్ఞానం ఏకేన అధికర్నరాణాం**
**జ్ఞానేన హీనేన పశుభిర్సమాన: "** **అని అన్నారు.**

ఆహారం, నిద్ర , భయం, సంసారం చేయడం వంటివి పశువులకూ, మానవులకూ సమానంగానే ఉంటాయి. కానీ పశువులకు లేనిది మానవునికి మాత్రమే ఉండేది జ్ఞానం ఒక్కటే. అలాంటి జ్ఞానం లేకపోతే మనిషి పశువుతో సమానమని పై శ్లోకం యొక్క తాత్పర్యం

జ్ఞానం వలన మనిషికి తెలివితేటలు, యుక్తాయుక్త విచక్షణ, ధర్మాధర్మములు, న్యాయాన్యాయాలు వంటివి అలవడ్డాయి. ఈ జ్ఞానానికి ప్రతీకలుగా వేదాలు, ఉపనిషత్తులు, పురాణ ఇతిహాస వాఙ్మయం, శాస్త్ర వాఙ్మయం ఏర్పడి మానవ జన్మను సార్ధకం చేసుకొనే మార్గాలను బోధించాయి.

భారతీయ సనాతన ధర్మంలో భౌతిక ప్రపంచం (ఇహం) ఆధ్యాత్మిక ప్రపంచం (పరం) అనేరెండు విషయాలున్నాయి. మానవులందరూ భౌతిక ప్రపంచంలో ఉన్నప్పటికీ వారి పరమగమ్యం ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించడమే. దీని కోసం ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత వంటి మార్గాలేర్పడ్డాయి.ఏ మార్గమైనా మానవుని ఆద్యాత్మిక ఔన్నత్య సాధనయే మూలంగా కలిగినది.

మానవుని పరమ గమ్యంలో ఇహం కంటే పరమే ప్రధానం కనుక ఆ పరానికీ (పరబ్రహ్మానికీ) సంబంధించిన అంశాల సాధనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ క్రమంలో మనిషి జన్మించినది మొదలు మరణించిన వరకూ (మరణించిన తరువాత కూడా) వివిధ సంస్కారాలు కుటుంబం నుంచి, సమాజం నుంచి అలవడతాయి వీటిలో నుంచే **"మాతృదేవోభవ"** , **"పితృదేవోభవ"**, **"ఆచార్య దేవోభవ"**, **"అతిధిదేవోభవ"** వంటి భావనలు ధర్మాలుగా చిన్నప్పటి నుంచే నేర్చుకోవడం జరుగుతుంది.దీని వలన ప్రస్తుతం మనం మానవ విలువలుగా చెప్పుకుంటున్న అంశాలు మన సనాతన ధర్మంలోని వ్యవస్థల వలన మనిషికి చిన్ననాటి నుంచే అలవడతాయి.

పాశ్చాత్య ప్రపంచంలో భౌతిక అంశాలకు పెద్దపీట వేస్తారు. అందువలన మానవ సంబంధాలకు మానవ విలువలకూ ప్రాధాన్యత తగ్గిపోతుంది. అక్కడ ఆధ్యాత్మికత కంటే (పరం) భౌతికత (ఇహం)కే ఎక్కువ విలువ ఉండటం వలన వ్యక్తుల మధ్య సంబంధాలు కానీ, కుటుంబ సంబంధాలు కానీ, సమాజ సంబంధాలు కానీ, ఆరోగ్యకరంగా ఉండవు. దాని వలన వ్యక్తిగతంగా, కుటుంబగతంగా, సమాజపరంగా అశాంతి ఏర్పడే స్థితి కనిపిస్తుంది. పాశ్చాత్య దేశాలు భౌతిక వనరుల దృష్ట్యా, మౌళిక వసతుల దృష్ట్యా, మార్కెట్ విలువల రీత్యా అభివృద్ధి చెంది ఉండవచ్చు. భౌతిక సుఖాల విషయంలో వారు సంతోషంగా ఉండవచ్చును. కానీ విలువల విషయంలో ఆ సంతోషం ఎంత అన్నది ఎప్పుడూ ప్రశ్నార్థకమే. ఎందుకంటే వారిని నడిపించేవి మానవీయ విలువలున్న విషయాలు కంటే, భౌతిక విజ్ఞానాలున్న అంశాలే. కానీ భారతదేశం మాత్రం అలాకాదు.

భారతదేవం వేల యేళ్ళ సంస్కృతీ సంప్రదాయాలు కలిగిన మహోన్నత దేశము. మానవ విలువ లకు పట్టం కట్టిన మహత్తర దేశం. మానవ విలువలను సత్యం, ధర్మం, న్యాయం అన్న అంశాలతో మేళవించి ఉన్నత మానవ వికాసమే ప్రధానంగా కలిగిన మహోజ్వల దేశం. అందుకే సత్యం యొక్క ప్రాధాన్యాన్ని తెలియజేయడానికి ఒక సత్యహరిశ్చంద్రుడు, ధర్మం యొక్క ప్రాధాన్యతను తెలియజేయ డానికి ఒక రామచంద్రుడు ఆదర్శాలుగా నడయాడిన దేశం. మహోన్నత మానవ విలువలకు పట్టం కట్టిన ఇతిహాసాలు వెలసిన దేశం. ఇంతటి ఘనమైన సంస్కృతి కలిగిన దేశం కాల పరిణామంలో విదేశీయుల పాలనలోకి వెళ్ళింది. వేయి సంవత్సరాలు పరాయి పాలకుల చేత పాలించబడింది. క్రమంగా మళ్ళీ పునరుజ్జీవితమై, స్వతంత్రమై తన పాలనను తాను చేసుకొనే స్థితికి చేరింది. అయిన ప్పటికి కాల ప్రభావానికి లోనై పాశ్చాత్య పోకడలను, విద్యను, సంస్కృతినీ అనుసరించాల్సిన స్థితిలోని కి జారుకొంది. ఫలితంగా భారతీయ సమాజంలోనూ, వ్యక్తుల మధ్య, కుటుంబాల మధ్య, సమాజం మధ్య అంతరాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. విదేశీయులు పోయినా వారు ఏర్పాటు చేసిన విద్యావ్య వస్థలే మేలైనవిగా భావించడం వలన శాస్త్రసాంకేతిక అభివృద్ధికి పాశ్చాత్య విజ్ఞాన అధ్యయనము తప్ప నిసరి అనే భావనలు ఉండటం చేత మనదైన వ్యవస్థ మారి పాశ్చాత్య ప్రభావ వ్యవస్థను మనమూ దిగుమతి చేసుకొన్నాము. అందువలన భారతీయ సంప్రదాయాలు వెనకపట్టు పట్టి పాశ్చాత్య సంప్రదా యాలు బలం పుంజుకున్నాయి. మంచి చెడ్డలు చెప్పె ఉమ్మడి కుటుంబ వ్యవస్థలుపోయి స్వేచ్ఛాస్వా తంత్ర్యాలకు ప్రాధాన్యతనిచ్చే వ్యక్తిగత కుటుంబ వ్యవస్థలు వచ్చాయి. జీవితాంతం ఒకరికొకరు తోడు నీడల్లా ఉండాల్సిన భార్యా భర్తల వ్యవస్థకు బీటలు వారే పరిస్థితులు వచ్చేసాయి. ధర్మా ధర్మాలు, పాపపుణ్యాలు పక్కకుపోయి భౌతిక అవసరాలే ప్రధానమైపోయిన రోజులూ వచ్చాయి. ఇటువంటి పరి స్థితులలో మనం ఒకసారి పునరాలోచన చేసుకోవడానికి కోల్పోయిన విలువలను తిరిగి పొందడానికి ప్రాచీన సాహిత్యంలో మానవ విలువలను అధ్యయనం చేయడం ద్వారా మన ప్రాచీన సనాతన సాంప్రదాయ గొప్పదనం మళ్ళీ తెలుసుకోవడానికి ఒక అవకాశం చిక్కుతుంది. ఇలా పరిశీలన చేయా ల్సిన ప్రాచీన సాహిత్య అంశాలలో మహాభారతం ధర్మ వ్యాధోపాఖ్యానం తల్లిదండ్రులు - మానవ విలు వలు అన్న అంశం ఒక్కటి.

మహాభారతం పంచమవేదం. ధర్మ తత్త్వజ్ఞులకు ఇది ధర్మశాస్త్ర గ్రంథం, నీతిశాస్త్ర కోవిదులకు నీతి గ్రంథం... ఇలా సర్వ విధాలా సర్వులకూ ఉపయుక్తమైన గ్రంథం అందుకే మహాభారతం గురించి ధర్మేచార్థే చ కామేచ మోక్షేచ భరతవర్ష భ !

యదిహాస్తి తదన్యత్ర యన్నే హాస్తి నతత్ క్వచిత్ అని సంస్కృత మహాభారతం ఆదిపర్వంలో పేర్కొనబడింది. ధర్మ, అర్ధ, కామ, మోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్న అంశాలు మరొక చోట ఉండవచ్చును. కానీ దీనిలో లేని అంశం మరెక్కడా ఉండదు. అదీ దీని విశిష్టత.

ఇలాంటి విశిష్టత కలిగిన మహాభారతంలో ధర్మ వ్యాధోపాఖ్యానం విలక్షణమైనది. ముఖ్యంగా ఆంధ్ర మహాభారతంలో ఎర్రన రచించిన అరణ్య పర్వదోపాఖ్యానం విలక్షణమైనది. ముఖ్యంగా ఆంధ్రమహాభారతంలో ఎర్రన రచించిన అరణ్య పర్వశేషంలో ఈ ఘట్టం మానవవిలువలకు సంబంధించి మణిమకుటంలా భాసల్లే ఘట్టం. ముందుగా దీనిలో కథాంశాన్ని పరిశీలించి ఆపై దీనిలోని మానవ విలువలను పరిశీలన చేద్దాము.

పూర్వం కౌశికుడు అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు తపస్వి. ఒకనాడు అతడు ఒక చెట్టు మొదట కూర్చొని వేదాలు వల్లె వేస్తుండగా ఆచెట్టు కొమ్మపై వాలి ఉన్న ఒక కొంగ అతడిపై రెట్ట వేసింది. అంతట ఆ కౌశికుడు మిక్కుటమైన కోపంతో ఆపక్షిని చూసాడు. వెంటనే ఆ పక్షి నేలపై పడి మాడి మసైపోయింది. తరువాత అతడు మద్యాహ్నం కావడం చేత సంధ్యావందనాది కార్యక్రమాలు నిర్వర్తించి సమీప గ్రామానికి వెళ్ళి ఒక గృహం ముందు నిలిచి "బిక్షాందేహి " అని అర్ధించాడు. అప్పుడు ఆ ఇంటి ఇల్లాలు ఆ బ్రాహ్మణ యోగికి భిక్ష సమర్పించడానికి లోనికి వెళ్ళింది. ఆ సమయంలో ఆ ఇల్లాలి భర్త ఆకలితో ఆయాసపడుతూ ఇల్లు చేరాడు. భర్తను చూచిన ఆ ఇల్లాలు కౌశికుని విషయం వదిలి భర్తకు పరిచర్యలు చేసి అతడికి భోజనం పెట్టింది. తరువాత అతనిని శయ్యపై పరుండబెట్టి అప్పుడు కౌశికునికి భిక్షను పట్టుకొని వచ్చింది. ఇలా వచ్చిన ఆ ఇల్లాలిని చూసి కౌశికుడు కోపంతో ఎర్రబడిన కళ్ళతో తనను అంతసేపు అలా నిలబెట్టినందుకు అధిక్షేపించాడు. అప్పుడు ఆ పవిత్రత కౌశికుని కోపానికి మాడిమసైపోవడానికి తానేమీ కొమ్మపైని కొంగను కానని చెప్పింది. ఎక్కడో అరణ్యంలో జరిగిన విషయం ఈమెకు ఎట్లా తెలిసిందని కౌశికుడు ఆశ్చర్యపడి ఆమె గొప్పతనాన్ని గ్రహించి మన్నించమని ప్రార్ధించాడు. అప్పుడు ఆ పతివ్రత కౌశికునికి కొని ధర్మాలను చెప్పి మరిన్ని ధర్మాలను గ్రహించడానికి మిథిలా నగరంలోని ధర్మవ్యాధుని ఆశ్రయించమని చెప్పింది.

కౌశికుడు మిథిలా నగరం చేరి ధర్మవ్యాధుని గురించి విచారించగా అతడు ఒక మాంసం అమ్ముకునే బోయవాడని తెలుసుకున్నాడు. మాంస విక్రయం వంటి పాపకర్మను చేస్తున్న ధర్మవ్యాధుని కలుసుకోవాలా వద్దా అని తటపటాయిస్తుండగానే తన మాంసం అంగడి నుండి ధర్మవ్యాధుడు బయటకు వచ్చి కౌశికుని గుర్తించి పతివ్రత పంపించిన విషయాన్ని ప్రస్తావించి లోపలికి ఆహ్వానించాడు. ధర్మవ్యాధుని పిలుపుతో రెండవసారి ఆశ్చర్యానికి గురయిన కౌశికుడు ధర్మవ్యాధుని జంతువులను చంపి హింసాకార్యము చేస్తూ మాంసాన్ని అమ్ముకోవడం తప్పుకాదా ? అని ప్రశ్నించాడు. దానికి ధర్మవ్యాధుడు మాంసవిక్రయం తన కులధర్మమని తన వృత్తిని తాను నిర్వర్తించడం తప్పుకాదనీ అంటూ ఎన్నో ధర్మ సూక్ష్మాలను చెబుతాడు. తన ఇంటికి తీసుకొని వెళ్ళి తాను తన తల్లిదండ్రులను సేవిస్తున్న విషయాన్ని చూపుతాడు. కౌశికుడు అడిగిన అన్ని సందేహాలను తీర్చి - కౌశికుడు ఎంతటి తపస్వి అయినప్పటికినీ అతడు తన తల్లి దండ్రులను నిరాదరించి తాను మాత్రం మోక్షార్ధియై తపస్సు చేసుకోవడం పట్ల ఆక్షేపించి తల్లిదండ్రులను ఆదర్సించాల్సినభాద్యత కౌశికునిపై

ఎంత ఉందో తెలియజేస్తాడు. తల్లిదండ్రులను పూజించడం వలన, స్వధర్మాచరణ వలన తనకు ఈ జ్ఞానం కలిగినదనీ కౌశికుని కూడా ఇదే విధంగా తల్లిదండ్రులను ఆదరించి స్వధర్మాచరణ చేయడం ద్వారా ఉన్నత స్థితిని చేరమని ఉద్బోధిస్తాడు. ఈ కథతో తల్లిదండ్రుల గొప్పతనం, నిజమైన బ్రాహ్మణుడంటే ఎవరు, శిష్టాచారుల లక్షణాలు వంటివి ఎన్నో ధర్మాలు గురించి ధర్మసూక్ష్మాల గురించి వివరించడం జరుగుతుంది. వీటి ద్వారా మనం ప్రస్తుతం మానవ విలువలుగా వేటిని ఆధునీకులు పేర్కొంటున్నారో ఆ విషయాలను తెలుసుకోవచ్చు. వీటిలో తల్లి దండ్రులకు సంబంధించిన అంశాలు చూద్దాం.

<u>**తల్లి దండ్రుల గొప్పతనం :**</u>

ప్రస్తుత సమాజంలో మానవ విలువల పతనంలో పరాకాష్టగా చెప్పబడే విషయం తల్లిదండ్రుల నిరాదరణ. ఏ పత్రిక చూసినా ఇంకే దూరదర్శనిని దర్శించినా తల్లిదండ్రులను నిరాదరిస్తున్న విషయాలు కనిపిస్తూనే ఉన్నాయి. మనిషికి తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు. తమ జీవితాలలో సుఖాలను దూరం చేసుకొని తమ సంతానం కోసం కష్టాలను ఇష్టాలుగా భరించే త్యాగజీవులు తల్లిదండ్రులు అటువంటి త్యాగజీవుల గొప్పదనం గురించి ధర్మవ్యాదోపాఖ్యానంలో క్రింది పద్యం ఎంత చక్కగా చెబుతుందో చూడండి.

**“ జననంబు మిగుల మాసములు దొమ్మిది యుద**
**రంబునం గరము భారంబు తోడ**
**భరియించి పదపడి ప్రాణ సంశయదశ**
**నొంది పుత్త్రుని గాంచునెందు దల్లి**
**తపములు యజ్ఞముల్ దానముల్ వ్రతంబులు**
**దేవతా సజ్జన సేవనములు**
**గావించు బుత్త్రుని గామించి జనకుడి**
**ట్లిరువుర పాటును సరియె తలప “**

**“ దనయు గని తల్లి దండ్రులు దమకు నతడు**
**భక్తుడుగుటకు ధర్మానురక్తుడగుట**
**కాసపడుదురు వినుమట్టి యాససిద్ధి**
**బొంద జేయునతడు చువ్వెనందనుండు. “**

కొడుకును తల్లి - తొమ్మిది నెలలు కడుపులో మోసి, మిక్కలి ప్రయత్నంతో మిక్కుటమైన శ్రమకు ఓర్చి , ఆ స్థితిలో అసువులు కోల్పోతానేమో అనే సందేహస్థితికి వచ్చి ప్రసవిస్తుంది. తండ్రి - కొడుకు పుట్టవలెననే కోరికతో ఉపవాసాది వ్రతాలు చేసి, క్రతువులు నిర్వహించి, దానధర్మాలు సలిపి నోములు నోచి, దేవతలను, సజ్జనులను పూజిస్తాడు. తల్లిదండ్రులు - కొడుకు పుట్టిన పిదప అతడు తమ యెడ ప్రేమ కలిగి తమను ఆరాధించాలనీ, ధర్మాచరణలో ఆసక్తి కలవాడు కావాలనీ కోరుకొంటారు.

ఇంతటి త్యాగశీలురయిన తల్లిదండ్రులను ప్రస్తుతం సమాజంలో కొంతమంది నిరాదరిస్తూ, వృద్ధాశ్రమాలకు తరలిస్తూ అలక్ష్యం చేస్తున్నారు. అలాంటి అలక్ష్యపరులకు ప్రతినిది కౌశికుడు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను అతడు ఆదరించుపోగా మోక్షాసక్తుడై ఇంటి నుంచి వెడలి వచ్చాడు. సమాజంలో ఇలాంటి వారందరికీ బుద్ధి కలిగేలా పై పద్యం తల్లిదండ్రుల గొప్పదనాన్ని వివరించడమే కాకుండా ధర్మవ్యాధుని చేత కౌశికునికి క్రింది విధంగా హితభోద చేయించాడు.

“ ఎంతయు వృద్ధులై తమకు నీ వొకరుండవ తెప్పగాగ న
త్యంత ముదంబునన్ బ్రదుకు తల్లిని దండ్రిని నుజ్జగించి ని
శ్చింతుడవై సదాధ్యయన శీలత వారియనుజ్ఞ లేక యే
కాంతను యెమ్మెయిన్ వెడలి తక్కట! నీవు గరంబు క్రూరతన్ “

నీ తల్లి దండ్రులు మిక్కిలి ముసలివారు వారికి నీవు ఒకడవే ఆధారం నీ మీదనే తమ ప్రేముడిని అంతయు పెట్టుకొని బ్రతుకుతున్న తల్లి దండ్రులను వదిలిపెట్టావు. వారిని వదిలి వచ్చేటపుడు నీవు వారి అనుమతిని తీసుకొనలేదు. నీవు వేదాధ్యయనం చేసి జ్ఞానాన్ని ఆర్జించ్చి, తరింపనెంచావు. కానీ, నీ తల్లిదండ్రుల గతి ఏమవుతుందో అని ఆలోచించలేదు. కఠినమైన నీ ప్రవర్తన నాకు నచ్చలేదు అని అంటాడు. ఈ మాటలు కౌశికునికి ఒక్కడికే కాదు తల్లిదండ్రులను వారి మానాన వారిని వదిలివేసి తమ దారి తాము చూసుకునే సంతానానికి కూడా జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల, తపన ప్రతి ఒక్కరితకీ ఉండవలసిందే. గొప్ప గొప్ప వృత్తులలో ఉద్యోగాలలో స్థిరపడవలసిందే. ఈ క్రమంలో తల్లిదండ్రులను నిరాదరణ చేసేవారు ఎందరో ఉంటారు. సంతానం యొక్క నిరాదరణకు తల్లిదండ్రులు ఏ విధంగా పిలపించి ఇబ్బందులు పడతారో ఇంకెంతగా పరితపిస్తారో చెబుతూ ధర్మవ్యాధుడు...

“ నీకై వగచి వగచి విచ్ఛిన్న హృదయులై
విగత చక్షులైరి వినవే? వార
లరిగి యింకనైన నమ్ముదు సళ్ళ యు
దగ్ర శోకవహ్ని నార్పరయ్య “

**అని చెప్పి ఎంతటి గొప్ప స్థితికిచేరుకోవాలని ప్రయత్నించే వారయినా మాతాపితరుల సేవను చేయాలని ఉద్భోదిస్తాడు. ఇలా చేయకపోతే సార్థకత చేకూరదని**

**" నీ యధ్యయనమ్మును సుకృ**
**తాయాసము నిష్ఫలంబులై చను గురు సే**
**వాయుక్తి లేక తక్కిన**
**జేయుము నా పలుకు మేలు సేకుఱు నీకున్ " అని అంటాడు.**

కౌశికుని ఉద్దేశించి ధర్మవ్యాధుడు ఈ మాటలు అన్నప్పటికినీ ప్రస్తుత సమాజం కూడా ఈ విషయాన్ని గ్రహించాలి. ధర్మవ్యాధోపాఖ్యానంలో కౌశికుని పాత్ర ద్వారా తల్లి దండ్రుల పట్ల ఉండకూడదో, తల్లి దండ్రులను ఎలా చూడకూడదో తెలుసుకొంటే ధర్మ వ్యాధుని పాత్ర ద్వారా తల్లి దండ్రులను ఎలా సేవించాలో తెలుసుకోవచ్చు. ధర్మవ్యాధుడు సుగుణాలఖని అతనికై వేరే దైవాలంటూ ఎవరూ లేరు. ఏ దేవతనూ అతడు పూజించడు. అతని తల్లి దండ్రులే అతని పాలిట దైవాలు. ధర్మవ్యాధుడు కౌశికుని తన ఇంటిలోనికి తీసుకెళ్ళి తన తల్లిదండ్రులను పరిచయం చేస్తాడు. ఆ సమయంలో వారు ఉన్నత ఆసనాలపై కూర్చొని వివిధ ఉపచారాలతో సేవతీరి ఉంటారు. అప్పుడు ధర్మవ్యాధుడు తన తల్లిదండ్రుల యోగక్షేమాలు మరొకసారి విచారణ చేస్తాడు. అప్పుడు ధర్మవ్యాధునికి అతని తల్లిదండ్రులు తాము ఎంత సంతోషంగా ఉన్నదీ తెలిపి ధర్మవ్యాధుని ప్రశంసించి అతనిని చిరకాలం జీవించమని ఆశీర్వదిస్తాడు. అప్పుడు ధర్మవ్యాధుడు కౌశికునితో..

**జనసుత వీరునా జననియు జనకుండు ! జూవె వీరులకు శశ్రూష సేసి**
**ఇట్టి పరిజ్ఞానమేను బ్రాపించితి! నమరుల బూజింతు రర్థి నెల్ల**
**వారును నొండు దైవంబుల నెఱుగ నీ ! వృద్ధుల నాపాలి వెల్పునఘు**
**కమనీయ పలపుష్ప గంధ భూషణ వస్త్ర ! ములు మనోహర భక్ష్యభోజ్యములను**
**వీరికెపుడు నివేదింతు వేట్క బుత్త్ర ! దార సహితుండనై నియతముగ సేవ**
**యాచరింతును వేదముల్ యజ్ఞములు వ్ర ! తంబులను వీర నా కను తలపు ధృడము**

వీరే నా తల్లిదండ్రులు. వీరికి పరిచర్య చేయడం చేతనే నాకు ఈ పరిజ్ఞానం లభించింది. అందరూ తమ కోరికలు ఈదేరడానికి దేవతులను పూజిస్తారు. నేను ఏ దేవతలనూ ఎరుగను, నాతల్లి దండ్రులే నా ప్రత్యక్ష దేవతలు. వీరిని చందన చర్చతో, పండ్లతో, పూలతో వారికి కాదలసిన తినుబండారాలతో అర్చిస్తాను. నా భార్యబిడ్డలతో కృషి వీరికి సేవ చేస్తాను. వారికి నేను చేసే సేవే యజ్ఞం. అదే వేదాలు నోములు అనే భావం నాలో నాటుకొని యున్నది. అని అంటూ తల్లిదండ్రులను పూజించడం చేత,

స్వధర్మాచరణ చేత తనకు జ్ఞానం కలిగిందని అటువంటి జ్ఞానాన్ని మాతాపితరుల సేవ చేస్తూ, స్వధర్మాన్ని ఆచరిస్తూ పొందమని చెబుతాడు.

ఈ మాటలు కౌశికునికే కాదు ఆధునికత పేరుతో, అవసరాల పేరుతో అవకాశం లేదనేసాకుతో తల్లిదండ్రులను నిరాదరణ చేస్తున్నవారికీ, వృద్ధాశ్రమాలకు పంపుతున్న వారికీ నీతులు మాత్రమే చెబుతూ (సామాజిక మాధ్యమాలలో) ఆచరణకు పూనుకోని ఆధునికులందరకూ ఈఘట్టం కనువిప్పే కదా.

**విల్లూరి అప్పల సత్యనారాయణ**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు,**
**నర్సీపట్నం.**
**ఫోన్ నెంబరు : 92472 31382.**

**ఆధార గ్రంథాలు :**

**ఆంధ్రమహాభారతం, తి.తి.దే. ప్రచురణలు, 5వ సంపూటం.**